క్లుప్తంగా

గాయపడిన నాయకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే తాటిపర్తి



రమేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

యర్రగొండపాలెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు, ఆదిత్య విద్యాసంస్థల అధినేత సూరె రమేష్‌ను ఎమ్మెల్యే, ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్ సీపీ నాయకులు చెంగళ్ నాగయ్య, కామిశెట్టి వెంకయ్య, సూరె ప్రసాద్ ఉన్నారు.

కల్తీ లేని పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం



పాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై మల్లికార్జునరావు

తాళ్లూరు: కల్తీ లేని పాలతోనే సంపూర్ణ ఆరోగ్యం అని, కల్తీ పాలను అరికట్టాల్సిన బాధ్యత మనదేనని ఎస్సై ఎస్. మల్లికార్జునరావు అన్నారు. మండలంలో ఉన్న అన్ని పాల ఉత్పత్తి కేంద్రాలను శనివారం తన సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాల కేంద్రాల యజమానులతో మాట్లాడుతూ కల్తీ పాలు విక్రయించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాల కేంద్రాల్లో ఉన్న పాలఉత్పత్తుల తయారు చేసే పరికరాలను పరిశీలించి ఇతర విషయాలు అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమలనాథ స్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత గొడ్రాలికొండ తిరుమలనాథ స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవార్లకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించిన అనంతరం పట్టువస్త్రాలు సమర్పించారు. అభరణాలు, పూలమాలలతో స్వామి వారిని అలంకరించారు. అమ్మవారి ఎదుట శ్రీచక్రం దగ్గర దంపతులు కుంకుమార్చన పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు గుండు ఎత్తు పందెం

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం గుండు ఎత్తు పందేలు ఏర్పాటు చేస్తున్నట్లుగా దేవస్థాన కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య శనివారం తెలిపారు. గుండు ఎత్తు పందెంలో పాల్గొనాలనుకునేవారు ఆదివారం 2 గంటల్లోపు రూ.150 ప్రవేశ రుసుం చెల్లించి రసీదు తీసుకోవాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుతిగా 10 తులాల వెండి, రెండో బహుమతిగా 5 తులాల వెండిని బహూకరిస్తున్నట్లుగా తెలిపారు.

ఓఆర్ఎస్‌తో ఆరోగ్యానికి ఉపశమనం

పెద్దారవీడు: ఎండల తీవ్రతను తట్టుకొని ఆరోగ్యాన్ని జాగ్రత్తగా ఉంచుకునేందుకు వేసవిలో ప్రతి ఒక్కరూ వైద్యుల సూచనలు పాటించడం చాలా అవసరం. సాధారణం కంటే అధిక స్థాయిలో ఉష్ణోగ్రతలు, వడగాలులు ఎక్కువగా ఉండే అవకాశాలు ఉన్నాయని భారత వాతావరణ విభాగం ఎప్పటికప్పుడు విషయాన్ని తెలియజేస్తోంది. సాధారణంగా ఏప్రిల్ నుంచి జూన్ నెలల మధ్యలో వడగాల్పులు ఉంటాయి. ఈ ఏడాది వాటి ప్రభావం మరింత ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ స్పష్టం చేస్తోంది. మండుతున్న ఎండలకు ఇప్పటికే ఉక్కపోత పెరిగింది. కార్మికులు, ఉద్యోగులు, వ్యాపారులు, వ్యవసాయ కూలీలు విధి నిర్వహణలో భాగంగా అనివార్య పరిస్థితుల్లో మండె ఎండల్లో తిరగక తప్పదు. ఎండ ప్రభావానికి లోనుకాకుండా ఎప్పటికప్పుడు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరిగా పాటిస్తే మంచిదని డాక్టర్లు సలహా ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్యశాల, వైద్య ఆరోగ్య కార్యకర్తల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. ఓఆర్ఎస్ ప్యాకెట్ అందుబాటులో లేకపోతే ఇంటిలోనే ఉప్పు, పంచదార, నీరు సాయంతో ఈ ద్రావణాన్ని తయారు చేసుకోవచ్చు. లీటరు నీటిలో చిటికెడు ఉప్పు, చారెడు (ఆరస్పూన్) పంచదారను కలిపి తాగవచ్చు. ఎండ తీవ్రతకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించడం అవసరం.



ఓఆర్ఎస్ ప్యాకెట్

వడదెబ్బ తగిలే అవకాశం

శరీరంలో సహజంగా నీటి శాతం తగ్గిపోవడంతో వడదెబ్బకు గురవుతుంటారు. ఇలాంటి ప్రమాదానికి గురి కాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ద్రావణం ఉపకరిస్తుందని వైద్యులు చెబుతున్నారు. స్థలం, కాలం ఆధారంగా శరీరాన్ని నిర్దేశించిన ఉష్ణోగ్రతలో ఉంచుకోవాలి. మెదడులో హైపోతలామస్ అనే భాగం శరీరంలోని వేడిని క్రమబద్ధీకరిస్తుంది. తగిన నీటిని తాగకపోయినా, ఎండలో ఎక్కువ తిరిగినా హైపోతలామస్ భాగమే అధిక ఉష్ణోగ్రతకు లోనై క్రమబద్ధీకరించే పని చేయలేదు. ఈ స్థితిలో తల తిరగం, నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, జ్వరం, చీకటి కమ్మినట్లు అనిపించడం, వాంతి అవుతున్న భావన కలగడం వంటి లక్షణాలు వడదెబ్బకు గురైనట్లు నిర్ధారిస్తాయి.

> **డీహైడ్రేషన్ తగ్గిస్తుంది**
>
> వడదెబ్బ బారిన పడిన వారు డీహైడ్రేషన్‌కు గురవుతారు. అటువంటి సమయంలో ముందుగా ఓఆర్ఎస్ ప్యాకెట్‌ను వినియోగిస్తే కొంత వరకు కోలుకుంటారు. ఓఆర్ఎస్‌లో అన్ని రకాల మినరల్స్ ఉంటాయి. అవసరమైన వారు తీసుకోవచ్చు. ఓఆర్ఎస్ అనేది వివిధ లవణాల మిశ్రంతో కూడిన పౌడర్ ప్యాకెట్. ఈ పౌడర్ ప్యాకెట్‌ను సురక్షిత లీటరు నీటిలో కలిపి రోజు మొత్తంలో వయసు ఆధారంగా తగిన మోతాదులో తాగాలి. మితిమీరిన మోతాదులో తాగితే అనర్థాలు జరిగే అవకాశం లేకపోలేదు.
>
> డాక్టర్ జగదీష్‌బాబు, పీహెచ్‌సీ, పెద్దారవీడు

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



952 మార్కులు సాధించిన మోడల్ పాఠశాల విద్యార్థి

పెద్దదోర్నాల: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరానికి సంబంధించి 104 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 81 శాతంతో 84 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరంలో 117 మంది విద్యార్థులు హాజరు కాగా 85 శాతంతో 100 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన బైపీసీ విద్యార్థి బెనిహిన్ 951 మార్కులు సాధించగా ఎంపీసీ విద్యార్థులు మానస, త్రిపురలు 917 మార్కులు సాధించారు. మొట్ల మల్లికార్జునపురం మోడల్ పాఠశాలకు సంబంధించి ఇంటర్మీడియెట్ రెండో సంవత్సరం 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 53 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 82 శాతం 43 మంది ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు సంబంధించి ఎంపీసీ రెండో సంవత్సర విద్యార్థి శివగాయత్రి 952 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచారు. కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలకు సంబంధించి ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీకి 27 మంది పరీక్షలకు హాజరు కాగా 63 శాతంతో 17 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం 11 మంది హాజరు కాగా 91 శాతంతో 10 మంది ఉత్తీర్ణత సాధించారు.

తాళ్లూరు: ఇంటర్మీడియేట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక వీకే జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ కె.అంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ ఇంటర్మీడియేట్లో 35 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 33 మంది ఉత్తీర్ణ సాధించారన్నారు. భాగ్యలక్ష్మి ఈఈటీలో 966/1000 మార్కులతో మొదటి స్థానం సాధించిందని, జి.లేఖన్య సీఈసీలో 846/1000 మార్కులతో మొదటి స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్లో 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 24 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. షేక్ సహీనా ఈఈటీలో 462/500 మార్కులతో మొదటి స్థానం సాధించింది. జి.అఖిల సీఈసీలో 452/500 మొదటి స్థానంలో సాధించిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది అభినందించారు.

చెన్నకేశవస్వామికి మహాపచారం



ఆలస్యంగా స్వామివారి నగరోత్సవం చేస్తున్న అర్చకులు

- అర్చకుల మధ్య వివాదం
- 10 గంటల పాటు ఆలస్యంగా జరిగిన అంకురార్పణ

మార్కాపురం టౌన్: లక్షలాది మంది భక్తుల ఇలవేల్పైన శ్రీదేవీ,భూదేవీ సమేత లక్ష్మీ చెన్నకేశవస్వామి వారికి మహాపచారం జరిగింది. ఆలయంలో పనిచేసే అర్చకుల మధ్య జరిగిన వివాదంతో స్వామివారికి శుక్రవారం రాత్రి జరగాల్సిన అంకురార్పణ ఆగిపోయి శనివారం ఉదయం 8 గంటల సమయంలో జరిగింది. దీనితో భక్తుల మనోభావాలు దెబ్బతిని అర్చకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఉదంతం దేవదాయశాఖ ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి ప్రారంభమై 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి 9 గంటలకు అంకురార్పణతో ఉత్సవాలను ప్రారంభం కావాలి. అయితే శుక్రవారం రాత్రి 8 గంటలకే ఉభయదాతలు పూజా సామగ్రితో ఆలయానికి వచ్చారు. ఆలయంలో పనిచేసే అర్చకుల మధ్య విభేదాలు తలెత్తి వాగ్వివాదానికి దారితీశాయి. దీనితో అంకురార్పణ కార్యక్రమం జరగలేదు. తెల్లవార్లు అర్చకుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఈ విషయం ఉదయం 5 గంటలకు స్వామివారి భక్తులకు సోషల్ మీడియా వేదికగా తెలిసింది. దీనితో పలువురు భక్తులు ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అర్చకుల మధ్య జరిగిన వివాదం ఈఓ శ్రీనివాసరెడ్డి దృష్టికి వెళ్లింది. దీనితో ఆయన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్చకులతో మాట్లాడి అంకురార్పణ పూజలు చేయించారు. అనంతరం స్వామివారి నగరోత్సవం నిర్వహించారు. కాగా ఈ వివాదం సోషల్ మీడియాలో ట్రోల్ అయింది. అంకురార్పణ రోజే ఇలా జరగడం పట్ల పలువురు భక్తులు ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



అన్నా రాంబాబు, షంషేర్ అలీబేగ్‌ను సన్మానిస్తున్న భద్రీనాథ్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేస్తూ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని.. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను లక్ష్యాలను నియోజకవర్గ వైఎస్సార్ పీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు సూచించారు. మార్కాపురం పట్టణానికి చెందిన ఎంఎస్ ఎంఈ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మేడా భద్రీనాథ్‌ను ఇటీవల పార్టీ మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన సందర్భంగా భద్రీనాథ్ శనివారం పట్టణంలోని జవహార్ కాలనీలోని అన్నా రాంబాబు నివాసానికి వెళ్లి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అన్నాను, మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ అలీ బేగ్‌ను సన్మానించారు. మండలంలోని నిఖరం పల్లి గ్రామంలో సీతారామచంద్ర స్వామి వారి తృతీయ వార్షికోత్సవ మహోత్సవంలో రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లోక శాంతి కోరుతూ గాయత్రి యజ్ఞం

గిద్దలూరు రూరల్: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కాశినాయన నగర్‌లో గల గాయత్రి మాత ఆలయం ఆవరణలో శనివారం గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో లోకశాంతి కోరుతూ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రి పరివార్ నిర్వాహకులు పీ హనుమంతారెడ్డి మాట్లాడుతూ గాయత్రి యజ్ఞం వల్ల సకల శుభాలు సంతరించుకుంటాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక జీవన విధానాన్ని అలవర్చుకుని జీవితాన్ని ఎంతో ఆనందమయంగా మార్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా గాయత్రిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ నారాయణరెడ్డి, సభ్యులు అంజనీకుమార్, వీరారెడ్డి, తదతరులు పాల్గొన్నారు.



యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

ఎంపీటీసీ వెలుగొండయ్యకు పరామర్శ

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు ఎంపీటీసీ చక్కెర వెలుగొండయ్యను వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు శనివారం పరామర్శించారు. వెలుగొండయ్య ఇటీవల ఆరోగ్యం బాగాలేక ఒంగోలు వైద్యశాలలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వెలుగొండయ్యను అన్నా పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అన్నాతో పాటు ఎంపీపీ ఎం మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, గాడి కోనేటిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి చిరుగూరి కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువు పొడిగింపు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో 11, 12 తరగతుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 21వ తేదీవరకు ప్రభుత్వం పొడిగించినట్లు కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అన్నారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. మిగతా తరగతులకు సంబంధించి ఖాళీలను బట్టి దరఖాస్తులకు అనుమతి ఇస్తామన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. వివరాలకు 85007 23716, 88977 10857 నంబర్‌లను సంప్రదించాలని సురేఖ సూచించారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ కంటి వైద్యుడు జీకే మోహన్‌రెడ్డికి చిత్తూరు జిల్లా కుప్పంలోని ద్రవిడ విశ్వవిద్యాలయంలో సైకాలజీ విభాగంలో డాక్టరేట్ అవార్డు పొందిన సందర్భంగా పట్టణంలోని టెన్నిస్ స్టేడియం ఆవరణలో శనివారం క్రీడాకారులు సన్మానం చేశారు. డాక్టరేట్ అవార్డు గ్రహీత డాక్టర్ జీకే మోహన్‌రెడ్డి 'పర్సనాలిటీ ఫ్యాక్టర్స్ అడ్జస్ట్‌మెంట్ అండ్ లోకస్ ఆఫ్ కంట్రోల్ యమాంగ్ ది విజువల్లి ఇంపైర్డ్ చిల్డ్రన్' అనే అంశంపై అవార్డును పొందడం చాలా గర్వంగా ఉందని గిద్దలూరు లాన్ టెన్నిస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ సీహెచ్ రంగారెడ్డి అన్నారు. కార్యక్రమంలో టెన్నిస్ లాన్ నిర్వాహకులు త్రిమూర్తిరెడ్డి, మురళిరెడ్డి, టపావలి, కోటయ్యగౌడ్,డా. సందీప్, డా.సుదర్శన్‌రెడ్డి, సతీష్, మహేష్‌కుమార్, రంగయ్య, అబ్దుల్లా, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే తాటిపర్తిని సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే తాటిపర్తికి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

యర్రగొండపాలెం: మార్కాపురంలో జరిగే శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్‌ను ఆ పార్టీ నాయకులు శనివారం ఆహ్వానించారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఆహ్వాన పత్రిక అందించిన వారిలో ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ కౌన్సిలర్లు బుస్సెట్టి నాగేశ్వరరావు, ముంగమూరి శ్రీనివాసులు, ఇమ్మడిశెట్టి వీరారావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు బొగ్గరపు శేషయ్య, నాయకులు బట్టగిరి తిరుపతిరావు, పత్తి కృష్ణ, రఘుపతి శివ, వై.పాలెం మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వెంకట సత్యనారాయణ, సూరె రమేష్, చెన్నంపల్లి సర్పంచ్ తమ్మినేని సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

హైస్కూల్లో గరల్స్ హాస్టల్

- అభ్యంతరం తెలుపుతున్న పూర్వ విద్యార్థులు

యర్రగొండపాలెం: స్థానిక గవర్నమెంట్ హైస్కూల్లో కళాశాలలకు చెందిన గరల్స్ హాస్టల్ భవన నిర్మాణాలకు సన్నాహాలు చేస్తున్నారు. భవనాల నిర్మాణం కోసం కావాల్సిన స్థలం కోసం కూటమి నాయకులు ఆ పాఠశాల హెచ్‌ఎంపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడికి తట్టుకోలేక హెచ్‌ఎం హైస్కూల్లో గరల్స్ హాస్టల్ భవనాల నిర్మాణానికి అవసరమైన అనుమతి పత్రాలు తయారు చేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న ఆ హైస్కూల్ పూర్వ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. హైస్కూల్లోని ఎకరం స్థలంలో భవనాలు నిర్మిస్తే విద్యార్థులు ఎక్కడ ఆటలాడుకోవాలని ప్రశ్నిస్తున్నారు. గరల్స్ హాస్టల్ భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని, ఆ నిధులతో స్థలం కొనుగోలు చేసుకోవచ్చని చెబుతున్నారు. అటువంటి పరిస్థితి లేనప్పుడు పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వానికి చెందిన స్థలాలు ఉన్నాయని, హైస్కూల్‌కు పక్కనే ఉన్న మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఖాళీ స్థలంలో గరల్స్ హాస్టల్ నిర్మాణం చేపట్టే అవకాశం ఉన్నా కొంతమంది తమ స్వార్థం కోసం హైస్కూల్‌ను టార్గెట్ చేసుకున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థలం కేటాయించే అధికారం హెచ్‌ఎంకు ఉందా? లేదా? అన్న విషయాన్ని కూడా ఆలోచించకుండా స్థలం కేటాయిస్తున్నట్లు పత్రాలు తయారు చేయడంలో అర్థం లేదని పేర్కొంటున్నారు. హాస్టల్ భవన నిర్మాణాలకు హైస్కూల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నట్లు తెలిసింది. వెంటనే హైస్కూల్లో గరల్స్ హాస్టల్ భవన నిర్మాణాల ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాలు



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

దొనకొండ: మండలంలోని యర్రబాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి ఆధ్వర్యంలో కార్యకర్తలు పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ సుభాషిణి మాట్లాడుతూ 0–5 సంవత్సరాల పిల్లలకు బరువు, ఎత్తు అంగన్‌వాడీ కేంద్రంలో చూసే బాధ్యత కార్యకర్తలదే అన్నారు. రక్తహీనత ఉన్న గర్భిణులకు ఆరోగ్యపరమైన సూచన, సలహాలు అందజేశారు. ఏఎన్‌ఎం నాగలక్ష్మి బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలు, చిన్నారుల ఆరోగ్యపరమైన విషయాలు వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యకర్త ధనలక్ష్మి, ఆశా వర్కర్ రమణమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలి

మార్కాపురం టౌన్: దేశంలో కోట్లాది మంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఐ, ఎంపీజే పార్టీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం మార్కాపురం పట్టణంలో సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి అందె నాసరయ్య మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం మొదటి నుంచి ముస్లింలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు పరచటంలో ప్రధాని మోదీ ప్రభుత్వం ముందు ఉన్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై అందరూ ఉద్యమించాలని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెద్దన్న, షేక్ కాశిం, పార్టీ నాయకులు కాశయ్య, శేఖర్, రసూల్, కరిముల్లా, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.